# తృప్తి

తులసి బాలకృష్ణ



ఆ రోజు —

గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలవడమంటే ఏమిటో, మెదళ్లో సప్త సముద్రాలు పొంగిన హోరు వినిపించడం అంటే ఏమిటో, ఆకాశం, భూమి అతి వేగంగా, దగ్గరయిపోతూండగా ఆ మధ్యలో నలిగిపోవడం అంటే ఏమిటో తెలిసొచ్చింది.

నా ఒళ్ళో తలదాచుకుని, పద్మ శోక సముద్రంలో తలమునకలు అవుతోంది.

ఆమెను ఓదార్చే శక్తిగాని, నేర్పు

గాని ఆ సందర్భంలో నాకు లేవు. కారణం – ఆమెను బాధించిన విషయం అంతగా నన్నూ బాధిస్తూండడమే. పబ్లిక్ గార్డెన్స్‌లోని లాన్స్‌లో రోజూ లాగే కూర్చుని మాట్లాడుకుంటున్నాం. రోజూలాగే హుషారుగా కాకుండా ఆ రోజు ఆమె అదోలా ఉండడం, చీకటి పడినా లేవకుండా, 'ఇంకొంచెంసేపు కూర్చుందాం' అనడం నాలో ఏవో అనుమానాల్ని రేకెత్తించాయి.

బాగా చీకటిపడింది. లాన్స్‌లోని జనమంతా వెళ్ళిపోయేరు.

– చటుక్కున నా చేతిని తన చేతుల్లోకి తీసుకొని, ముద్దుపెట్టుకుంది పద్మ. అయోమయంగా చూసాను ఆమెవైపు నా మొహంలోకి ఒక్కసారి చూసి, గబుక్కున నా ఒళ్ళో తల దాచుకుని బావురుమంది. మతిపోయినట్లయింది నాకు. నెమ్మదిగా ఆమె జుట్టులోకి వ్రేళ్లు పోనిచ్చి నిమిరి, తల పైకెత్తాను.

"ఏమిటిది పద్మా, ఏమయిందని?!"

"శశీ ! నా అంత దురదృష్టవంతురాలు మరొకరుండరు."

"ఛ ఛ ... ఏమిటిది ? ... అసలు విషయం ఏమిటి చెప్పు."

"మా ఇంట్లో ఈ రోజు మా నాన్నతో పెద్ద గొడవ జరిగింది. మన పెళ్ళికి మా నాన్న ఒప్పుకోవడంలేదు. ఈ రోజుతో మన సంబంధం తెగిపోవాల్ట నేను మా బావనే పెళ్లాడాలట, లేకపోతే తను ఆత్మహత్య చేసుకుంటార్ట......" అంటూ వెక్కుతూ నా ఒళ్ళోకి వాలిపోయింది.

– ఆ తర్వాత మా మధ్య ఎంతసేపటివరకూ మాటలు లేకపోవడం జరిగిందో చెప్పలేను. మూగభాషలో మాత్రం ఓదార్చుకున్నాం. సానుభూతి చూపించుకున్నాం. అటువంటి పరిస్థితి పగవాళ్లకూ్కడా రాకూడదనుకున్నాం.

నిజానికి నేను అప్పటికే జీవితంలో రాజీపడ్డం నేర్చుకున్న మనిషిని. కారణం – కొన్ని తప్పకుండా జరుగుతాయి అనుకున్నవి కాకపోవడమే. కాని నేను కలలో కూడా ఊహించని మంచి జరిగిన సందర్భాలుకూడా ఉన్నాయి. కనుకనే జరిగిందేదో మన మంచికోసమే అని సర్దిచెప్పుకోవడం అలవాటు చేసుకున్నాను. నిజానికి అలా తృప్తిపడకపోతే చేయగలిగిందేదీ లేదు.

"పద్మా ! లే...చూడు – అనవసరంగా బాధపడకు. మనం అనుకున్నవన్నీ జరిగితే మన కోర్కెలకి అంతం ఉండదు. ఏది జరిగినా మన మంచికే అనుకోవాలి." ఎలా చెప్పానో నాకే తెలియదు. కుంచించుకుపోయేను.

"అంటే నువ్వనేది... ?" అనుమానంగా చూస్తూ అడిగింది.

"ఉం... మీ బావని ... ఒప్పుకోమని"

'శశీ !?!...నువ్వు...నన్ను...వేరే

వ్యక్తిని పెళ్లాడమంటున్నావా ?!! ... అయితే...అయితే నీ ప్రేమ..."

- సూటిగా ఆమె కళ్లలోకి చూసాను.

"పద్మా ! ప్రేమకి పరిపూర్ణత పెళ్ళితోటే లభిస్తుందంటే – అది నీ ఉద్దేశ్యంలో అవివేకమే. ప్రేమంటే ఆకర్షణ కాదు, ఇద్దరు వ్యక్తుల్ని శాస్వతంగా కలిసుండాలని శాసిస్తూ కట్టిపడెయ్యడమూ కాదు. ఒకవ్యక్తి క్షేమం కోసం, స్నేహం కోసం, బాగుకోసం మరొక వ్యక్తి అనుక్షణం లోలోనే పడే తపన, ఆర్తే ప్రేమ. ఆ వ్యక్తితో అనునిత్యం కలిసుండక్కర్లేదు. వాళ్లమధ్య భార్యాభర్తల సంబంధమే ఉండక్కర్లేదు అది ఒక మగ, ఆడల మధ్యనే ఉండక్కర్లేదు. ఎవరైనా ఎవర్నైనా ప్రేమించొచ్చు. కాబట్టి మనిద్దరం భార్యాభర్తలం కానంతలో – మనం ఒకర్నొకరు మరిచిపోతామని నువ్వనుకోనక్కర్లేదు మీ ఇంట్లో అంతా కూడా మన పెళ్ళికి అంగీకరిస్తారని ఆశించాం. కాని అలా వ్రాసిపెట్టుంది. ఏం చేస్తాం ? లెటిట్ బి – మీ బావని పెళ్ళిచేసుకో. మీ మావయ్య మీ నాన్నకి చిన్నతనం నుంచీ ఉపకారం చేస్తూ వచ్చాడని చెప్పావు కదూ ' ఆ ఉద్దేశ్యంతో మొదట్నుంచీ మీవాళ్లకి నిన్ను మీ బావకి యిచ్చి చేద్దామని వుండొచ్చు వాళ్లకి మాటకూడా యిచ్చి ఉండొచ్చు. నన్ను పూర్తిగా మరిచిపొమ్మని, ఇక నీకూ నాకూ సంబంధంలేదని చెప్పట్లేదు నేను. నీ బావతో నీ పెళ్ళి జరిగినప్పట్నుంచి నా ముఖ్యస్నేహితు డవుతాడు అతను. మన స్నేహం మీ వివాహానికి ఎటువంటి ఆటంకం కాకుండా మీరిద్దరూ అన్యోన్యంగా నూరేళ్లూ జీవించాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను." గుక్క తిప్పకోకుండా, ఆమెకు మధ్యలో మాట్లాడే అవకాశం యివ్వకుండా చెప్పేశాను

ఏదో అనబోయి, నా ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది గానీ, ఆమెకు నోటమాట రాలేదు.

* * *

ఓ రోజు —

ఓ శుభముహూర్తాన పద్మకు ఆమె బావతో వివాహం వైభవంగా జరిగిపోయింది నా పద్మ వివాహం – నా కళ్లెదురుగా — మరొక వ్యక్తితో — జరుగుతూండగా చూస్తున్నాను. ఎంత నిబ్బరించుకున్నా కంటిలో చెమ్మ అడ్డుకోక తప్పిందికాదు నాకు. వాళ్ళు కోరినట్లుగా వాళ్ళ అమ్మాయి వివాహం జరగడానికి నే నేవిధంగానూ ఆటంకం కాకపోవడం కారణంగా పద్మ తల్లిదండ్రులు నన్ను ఎంతగా పొగిడారో, ఎన్ని మర్యాదలుచేశారో మాటల కందని విషయం

నా కాళ్లకి దణ్ణంపెట్టి భర్తకి నన్ను పరిచయంచేసింది పద్మ.

పద్మ భర్త సుకుమార్ బావున్నాడు. అతని ఉద్యోగం బాగుంది — బ్యాంకు ఏజంటు. అతని వెనక ఆస్తికూడా బాగానే ఉంది. అన్నిటినీ మించి నాకు షేక్‌హాండ్ యిస్తూ అతను నవ్విన వెన్నెలనవ్వు చాలా చాలా బావుంది. వారి వివాహ జీవితం మూడు పువ్వులూ, ఆరు కాయలూగా విరాజిల్లాలనే నా అభిలాషని వారికి తెలియజేసి, శెలవు తీసుకున్నాను.

* * *

ఈ రోజు —

ఇంతటి ఘోరం జరుగుతుందని నాకు ఎప్పుడూ పీడకల కూడా రాలేదు. గత రెండేళ్ళలోనూ నా శరీరం, హృదయం మిలట్రీలో ఎంతగా రాటు దేలినా యీ వార్తని నేను ఓర్చుకోలేని రోజు.

సుకుమార్‌కి కారుప్రమాదం అయ్యిందని తెలిసి యిక్కడి కొచ్చాను. హాస్పిటల్‌కి పరిగెత్తాను. నన్ను చూస్తూనే పద్మ హృదయవిదారకంగా బావురుమంది. ఆమెను ఓదార్చడానికి నా వద్ద మాటలు లేవు. సుకుమార్ని చూస్తూంటే గుండె తరుక్కుపోతున్నట్టయ్యింది

— అతని రెండు కాళ్ళూ తీసేశారు.

హృదయమంతా విచారం నిండిపోగా, పెగలక పెగిలిన స్వరంతో, "ఎలా జరిగిందిది !" అన్నాను. అంతకంటే అసలు ఏం మాట్లాడాలో తోచలేదు.

సుకుమార్ తేలిగ్గా నవ్వేశాడు. "విధి" అన్నాడు. ప్రక్కనే ఏర్చుని ఏడుస్తున్న పద్మభుజం నిమిరాడు.

అతన్ని చూస్తూ మౌనంగా కూర్చుండిపోయేను.

నన్ను యింటికి వెళ్ళి రెస్టు తీసుకోమని నౌకరుకి పురమాయించాడు సుకుమార్. ఇంటికి వచ్చాక నాకు రూము చూపించి, అన్ని సదుపాయాలు చూసాడు నౌకరు. పద్మ హాస్పిటల్లో భర్తవద్దే ఉండిపోయింది. స్నానంచేసి, నాలుగు మెతుకులు కతికి, విశ్రాంతి తీసుకుందామని పక్కమీద వాలేనన్నమాటేగానీ, ఎక్కడి విశ్రాంతి ?! పద్మ జీవితం యిలా అయిపోవడం నాకు యెంతో బాధ కలిగిస్తోంది. మేమిద్దరం కలిసి జీవించేభాగ్యం కలగక పోయినా, నా జీవితంలో నా ప్రక్కన మరో యువతికి స్థానం కల్పించకూడదని నేను నిశ్చయించుకున్నా, పద్మ హాయిగానే జీవించగలుగుతోంది కదా అని సంతోషించాను. కాని...కాని... యింత ఘోరం......

"శశీ ! ఓ అరగంటపోయేక నాతో బయటకు రావడానికి నీకు వీలవుతుందా? రెస్టు తీసుకుంటావా ?"

ఉలిక్కిపడి, మోచేతుల ఆసరా మీద పైకి లేచి, గుమ్మంవైపు చూసాను.


పద్మ. చేతిలో ప్లాస్టిక్ బ్యాగూ,

ఫ్లాస్కు- అప్పుడే హాస్పిటల్‌నుంచి వచ్చినట్లుంది.

"అలాగే వస్తాను. రెస్టు అవసరం లేదు, నా కిప్పుడు. ఇప్పుడు రమ్మన్నా నేను సిద్ధమే." లేచి కూర్చుంటూ అన్నాను.

"అబ్బబ్బే, తొందర లేదులే - రెస్టు తీసుకో. ఓ అరగంట పోయేక వెళ్దాం" అని లోపలికి వెళ్ళిపోయింది.

అరగంట ఆరుగంటల్లా గడిచింది. లేచి, బట్టలు వేసుకుని, పద్మతో బయటకు బయల్దేరాను. టాక్సీని పిలిచి ఎక్కమంది. ఎక్కడికో తెలియక పోయినా మాటాడకుండా ఎక్కి కూర్చున్నాను. తనూ ఎక్కి. "పబ్లిక్



గార్డెన్స్" అంది డ్రయివర్‌తో. నాకు మతిపోయింది. కంగారుగానూ, అయోమయంగానూ ఆమె ముఖంలోకి చూసాను. ఆమె బయటకు చూస్తూ కూర్చుంది.

– పబ్లిక్ గార్డెన్స్‌లో రెండేళ్ళక్రితం మేం కూర్చునే లాన్స్‌లో అదే స్థలంలో కూర్చున్నాం.

పద్మ రుమాలుతో కనుకొలకుల్ని తుడుచుకుంది.

"పద్మా ! నిజంగా, నీకు వచ్చిన యీ కష్టానికి నేనెంతగానో బాధపడుతున్నాను. అయామ్ గ్రేట్లీ గ్రీవ్డ్" అన్నాను బాధగా.

పద్మ మాట్లాడకుండా తలవంచుకుని కూర్చుంది.

"పద్మా ? ఎలా జరిగింది యీ ప్రమాదం ?" అన్నాను.

నెమ్మదిగా తల యెత్తింది పద్మ. సూటిగా నా కళ్లలోకి చూసింది.

"దేవుడు నన్ను చిన్నచూపు చూడబట్టి జరిగింది. యీ ప్రమాదం ఎలా జరిగిందో నీకు చెప్పడానిక్కాదు నిన్ను యిప్పుడు యిక్కడకు తీసుకొచ్చింది... శశీ ! ... నువ్వు...నన్ను పెళ్ళిచేసుకుంటావా ?"

— నేను కూర్చున్న నేల అమిత వేగంతో పాతాళంలోకి జారిపోతున్నట్లయింది. ఆమె వేసిన ప్రశ్నవల్ల కలిగిన షాక్‌ని తట్టుకోలేకపోయాను.

"ఇలాంటి ప్రశ్న, యీ పరిస్థితుల్లో ఈ మనిషి యెలా అడగ్గలుగుతోందని కదూ ఆశ్చర్యపోతున్నావు ?! నాకు తెలుసు శశీ ! కానీ... ఈ ప్రశ్నంటూ నేను వేయగలిగితే – అది నిన్నొక్కణ్ణే. ఇంకొకర్ని వేసే అర్హతగానీ, ధైర్యంగానీ నాకు లేవు. చెప్పు. నీ కభ్యంతరమా ?" అదే చూపు చూస్తూ రెట్టించింది.

"పద్మా! ఎందుకిలా అడుగుతున్నావు నువ్వు ?... నువ్వేమీ అనుకోవని తలచి ఓ ప్రశ్న అడుగుతున్నాను – నీ భర్త మంచివాడు కాదా ? – అంటే నా ఉద్దేశం...యిన్నాళ్లూ నిన్ను బాధలు పెట్టేవాడా ?"

"లేదు. ఏ బాధలూ పెట్టలేదు. ఆయన చాలా మంచివాడు. ఒక్క-మాటలో – దేవుడు."

"మరి ?'! అంత మంచివాడయినప్పుడు...నువ్వు...నన్ను..."

"ఇప్పుడు నా వయస్సెంత ?" – చటుక్కున అడిగింది, నా మాటల్ని మధ్యలో త్రుంచుతూ.

ఆ ప్రశ్న అలా యెందుకు అడిగిందో నాకు అర్థంకాలేదు. తనే అందుకుంది, "ఇరవై అంటే అసలు అనుభవించవలసిన జీవితమంతా ముందే ఉన్నదన్నమాట. ఇలాంటి వయస్సులో భర్త శాశ్వతంగా అవిటివాడయిపోతే, యిక జీవితాంతం అతనికి సతీ అనసూయలా సేవలు చేసుకుంటూ గడపడం నాలాంటిదానికి సాధ్యంకాదు." ఆమె గుండెల్లోంచి దుఃఖం తన్నుకొచ్చి గొంతు వణికింది. కళ్లల్లో చెమ్మ.

"నీ మనసెంతగా బాధతో సతమతమవుతోందో నేను వూహించగలను పద్మా ! కానీ విధి నెదిరించడం ఎవరి తరమూకాదు."

"ఎందుక్కాదు ? అన్నీ సాధ్యమే. విధి, సంఘం – యివికాదు నాకు

ముఖ్యం. నా భర్తకి జరిగిన ప్రమాదానికి నేనుకూడా అతనితోబాటు జీవితాంతం సంతోషానికి దూరం కావాలంటే నా మనసుకి నేను సమాధానం చెప్పుకోలేకపోతున్నాను. ఇకముందు నా భర్తతో హాయిగా జంటగా తిరగలేనంటే గుండెల్లో వణుకు పుడుతోంది స్కూటర్ల మీద కిలకిల్లాడుతూ పోతూన్న నా ఫ్రెండ్స్‌నీ, యితర జంటల్నీ చూస్తూంటే ఉక్రోషం, అసూయ కలుగుతున్నాయి. గుర్రాల్లా పరిగెట్టే నా కోర్కెల్ని యింత చిన్నవయసులో చంపుకోవడం అసాధ్యం. అది జనసత్వాలు ఉడిగినవారికి తిండికి గతిలేనివారికి మాత్రమే సాధ్యమేమో! నేనూ అందరు యువతుల్లాగే అన్ని సుఖాలనూ పొందాలిగానీ, యింత చిన్న వయసులోనే నా బంగారు భవిష్యత్తుని బూడిదపాలు చేసుకోవడం నా కిష్టం లేదు. నా ఈ పరిస్థితిని, నా మనస్సునీ అర్థంచేసుకున్నారు నా భర్త. నన్ను మళ్లీ పెళ్ళిచేసుకోమని ఆయనే అన్నారు. కావాలంటే యిప్పుడు నన్ను చేసుకున్న వ్యక్తితో వేరేగా కూడా వెళ్ళిపోవచ్చునన్నారు. తన మూలంగా నా బంగారు భవిష్యత్తు నాశనం అయిపోవడం తనకి సుతారామూ యిష్టంలేదన్నారు. ఇంక యెవ్వరి అడ్డంకీ లేదు. నీకు యిష్టమే కదూ?"

— నిజంగా ఆ సందర్భంలో నాకు పిచెక్కిపోతుందేమోనని భయంవేసింది. అసలు ఈ ఊరు రాకుండా ఉండవలసింది అనిపించింది. ఏనాడయితే మా ప్రేమకు పెళ్ళి జరగలేదో ఆనాడే పెళ్ళి అనే మాటకి గుడ్‌బై చెప్పి, మిలట్రీలోకి వెళ్ళిపోయి ఒకరకం జీవితానికి అలవాటుపడ్డ నేను యిప్పుడు మళ్ళీ పెళ్ళి విషయం తలపెట్టడమా?! అందులో ఆమె భర్త సజీవుడై ఉండగా?!... పైగా ఈ పరిస్థితుల్లో!!! ... నా మెదడు వేడెక్కిపోయింది... ఆ వేడిలోంచే చిన్నమెరుపు పుట్టింది.

"పద్మ! నువ్వు పునర్వివాహం చేసుకోవాలనుకోవడం—అందరు యువతుల్లా నువ్వు సుఖాలనుభవించలేకపోవడం వారిలా స్కూటర్లమీదా, కార్లమీద, సినిమాలకి, షికార్లకి యిక ముందు భర్తతో సరదాగా తిరగలేను కదా అనే బాధతోనే కదూ!" అన్నాను తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో.

— మౌనంగా క్రిందిచూపుతో చూస్తూ తలాడించింది పద్మ.

"ఊఁ...మన వివాహం సంగతి ఒక్క అరగంటలో నేను నీకు చెప్తాను. ఈలోగా కొన్ని విషయాలు చెప్తాను. వింటావా?" అన్నాను

'అలాగే' అన్నట్లుగా తలూపింది.

మంచి ఉత్సాహం, ఒకవిధమైన ధైర్యం కలిగాయి నాకు

"కొందరికి మిలట్రీ అంటే మెకానికల్‌గా సాగిపోయే జీవితంలా కనిపించవచ్చుగానీ — నాలాంటివాడికి మాత్రం

చాలా ఆనందదాయకమైన జీవితం అది. టైమ్‌టేబిల్ ప్రకారం మేం యెంత క్రమశిక్షణాయుతమైన అలవాట్లు అలవరుచుకోవలసి వుంటుందో—లీజరు టైంలో అంత స్వేచ్ఛ ఉంటుంది మాకు. ఆ లీజర్ టైంలో మేం ఆడతాం, పాడతాం, కబుర్లు చెప్పుకుంటాం ... ఓహ్, ఒకటేమిటి. అలా కబుర్లు చెప్పుకునేటప్పుడు సుఖంగా జీవించే జంటల్ని గురించిన టాపిక్‌లు కూడా చాలానే వచ్చేవి. ఊరికే చెప్తాను — సరదాగా విను," అని ఆమె ముఖంలోకి చూసాను.

మొహంలో విసుగును కాని, వినాలనే కుతూహలాన్నిగాని చూపించలేదు పద్మ. వింటూ అలాగే చూస్తూ కూర్చుండి పోయింది.

"మాన్‌సింగ్ అనే పంజాబీ వాళ్ల ఊరికి సంబంధించిన ఒక విషయం చెప్పాడు. వాళ్ళింటి దగ్గరలో ఒక సింగుగారికి రంభలాంటి పెళ్లాం ఉండే దిట. భర్తని పూవుల్తో పూజించేటంతటి ఉత్తమ యిల్లాలు ఆమె. స్నేహితు లంతా కూడా సింగుగారి అదృష్టాన్ని తెగ పొగిడేవారు. ఊరు అందరి దగ్గరా సింగుగారు మంచిగానే వుండే వాడు, ఇంటికి రాగానే మాత్రం భార్యని చచ్చేలా బాదేవాడు. ఇంతకీ ఆవిడ చేసిన మహాపాపం ఏంవిటయ్యా అంటే అందంగా వుండడమే. జెలసీ. ఊళ్ళో అందరూ తన భార్యని పొగుడు తుంటే కట్టుకున్న భార్యమీదే జెలసీ అతగాడికి. తను ఆమెకి తగనివాడి నేమోననే ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు. గమ్మత్తేమిటంటే ఇంట్లో అంత రభస జరిగినా, సాయంత్రం అయ్యేసరికి భార్యతో షికారుకే బయల్దేరేవాడుట ఆయన. ఆ జంటను చూస్తే — వాళ్ళు ఇంటిదగ్గర యింత గొడవపడతారంటే ఎవ్వరూ నమ్మలేరన్నమాట." అని ఆమె ముఖంలోకి చూసాను. పద్మ ముఖం కొంచెం వాడింది. ఏవో ఆలోచ న్లోకి జారుతోంది ఆమె.

"అలాగే గణేశన్ అనే యింకో మిత్రుడు యింకో సంఘటన చెప్పాడు. వాళ్ల ఊళ్లో ఓ జంట వుంది. భార్యా భర్తలిద్దరూ సమానంగా చదువుకున్న వారే. ఆమె కూడా చదువుకున్నదే కాబట్టి కట్నం అవసరంలేదని ఆమెని వివాహమాడాట్ట ఆయన. కానీ వివాహం అయిన తర్వాత "నలుగురు మగాళ్ళ మధ్యా నువ్వు వుద్యోగం చెయ్యడానికి వీల్లేదు" అన్నాడు. సరేనని యింటి దగ్గరే వుండిపోయింది ఆమె. కానీ ఇంటిదగ్గర భార్య ఏం తప్పుడు పనులు చేస్తోందోనని అనుమానం అతగాడికి. యింటికి రాగానే అనవసరపు అనుమా నాల్తో నానా బాధలకు గురిచేసేవాడు ఆమెని. అలాగే, "కట్నం లేదూ, ఏం లేదూ, తేరగా యింటిదగ్గర కూచుని మెక్కుతున్నావు" అని నానా మాటలూ అనేవాడు తిండికూడా సరిగ్గా పెట్టేవాడు

కాదు. పాపం ఆ అమ్మాయి కుళ్ళి కుళ్ళి ఏడ్చేది. మళ్ళీ వాళ్ళు బయట పార్టీకీల, షికార్లకీ అందంగా తయారై ఎంతో హుషారుగా వెళ్తూండేవారు. వాళ్ల గురించి తెలియనివారు ఏమనేవారుటో తెలుసా - 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' కపుల్ అని." అంటూ మళ్ళీ పద్మ ముఖంలోకిచూసాను. ఆమె ముఖం బాగా మారిపోయింది. కళ్లల్లో ఏదో కంగారు తృప్తిగా లోలోనే నవ్వుకున్నాను.

"అలాగే వెంకట్రావు అని మన విశాఖపట్నం ఆయన యింకో సంఘటన చెప్పాడు. వాళ్ళ ఊళ్ళో ఒక పెద్ద డాక్టరుగారికి ఓ అందమైన భార్య వుంది. తనొక్కడితోనే ఆమె మాట్లాడా లని ఆయన ఆంక్ష పెట్టాడు. తన తమ్ముడితో కూడా మాట్లాడనిచ్చేవాడు కాదు. ఆఖరుకి ప్రొద్దున్నొచ్చే పాల వాడితోగాని, పేపర్ బాయ్‌తోగాని, అర్జంటు కేసు ఏదైనా వస్తే ఆపేషంటు తాలూకు మగవారితోగాని మాట్లాడ్డానికి వీల్లేదు ఒకసారి ఆమె కజిన్‌బ్రదర్ వచ్చినప్పుడు అతనితో ఆమె మాట్లాడిం దని ఒంటిమీద ఆమెకు వాతలు పెట్టాట్ట. బయటకొస్తే మాత్రం యిద్దరూ నవ్వుతూ, హాయిగానే తిరుగుతూ ఉండేవారు. చివరికి ఆయనకి ఓ రోజున ఏక్సిడెంటయి ఓ కాలు పోయింది. తను అవిటివాడవడం అలుసుగా తీసుకొని ఆమె ఇష్టమొచ్చినట్లు తిరుగుతుందనే మూర్ఖభయంతో ఆమెని ఓ గదిలో బంధించి, బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేసాట్ట. స్నానం, భోజనం మొదలైన సందర్భాల్లోమాత్రం తగు కాపలాతో ఆమెని వదిలేవాడు. అలాగే ఆఊళ్ళోనే యింకో ఆయన..."

"ఆగు...!" అరిచింది పద్మ.

కంగారుపడ్డట్టు నటిస్తూ ఆమె ముఖం లోకి చూసాను.

"ఇంక చెప్పొద్దు. నేను వెంటనే మా ఆయన దగ్గరకి వెళ్లాలి నువ్వు వస్తు న్నావా ? ఉంటావా ?" లేచి నిల్చుని సూటిగా ప్రశ్నించింది. కంఠధ్వనిలో ఏదో తొందర.

"అదేమిటి అప్పుడే లేచావు ?! కూర్చో - ఈ వింతకూడా చెప్పనివ్వు. పైగా మన పెళ్ళి విషయం......"

"ఇంకేం చెప్పొద్దు. నీకు దణ్ణం పెడతాను. జరిగినదానికే యెంతో సిగ్గుపడుతున్నాను. నన్ను ఆ భగవం తుడు కూడా క్షమించడు. నా పాలిట దేవుడు మా ఆయనే. ఆయనతోదే నా జీవితం. ఆయన్నే క్షమాపణ కోరుకుం టాను. క్షమించగలిగే మంచిహృదయం ఆయనకుంది. ఇకనుంచీ ఆయనకే అంకితం అయిపోతాను. దయచేసి వెంటనే పద. ఈ సమయంలో ఆయన్ని వదిలి వుండడమే మహాపాపం. ప్లీజ్ - త్వరగా నడు" అంటూ తను గబగబా వెళ్ళిపోసాగింది.

నవ్వుతూ లేచి, "థేంక్ గాడ్" అనుకుని, ఆమెని అనుసరించాను.